విశాలాంధ్ర

కృష్ణా జిల్లా

నేడు కృష్ణా విశ్వవిద్యాలయానికి గవర్నర్

విశాలాంధ్ర-మచిలీపట్నం : స్వతంత్ర సమరయోధులు, గ్రంథాలయ ఉద్యమ నిర్మాత, సామాజిక ఉద్యమకారులు గాడిచర్ల హరిసర్వోత్తమరావు అవార్డ్ బహుకరణ కార్యక్రమంలో పాల్గొనేందుకు రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్‌నజీర్ మచిలీపట్నం విచ్చేస్తున్నట్లు కృష్ణా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య జీ జ్ఞానమని తెలిపారు. బుధవారం కృష్ణా విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గాడిచర్ల హరిసర్వోత్తమరావు 140 వ జయంతి వేడుకలు పురస్కరించుకొని గురువారం విశ్వవిద్యాలయంలో జరిగే గాడిచర్ల ఫౌండేషన్ అవార్డ్ బహుకారణ కార్యక్రమంలో గవర్నర్ పాల్గొంటున్నట్లు ఆయన తెలియచేశారు. మాజీ మంత్రి మండలి బుద్ధ ప్రసాద్‌కు ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య హేమచంద్రరెడ్డి, కలెక్టర్ పి రాజబాబు తదితరులు పాల్గొంటారు అని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో రిజిస్ట్రార్ డా. బ్రంహచారి, గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షులు కె చంద్రేఖర కల్కురా, సమన్వయకర్త గుత్తికొండ సుబ్బారావు, కరెడ్ల సుశీల తదితరులు పాల్గొన్నారు.

మోసపూరిత అరెస్టులతో మోసం చేయలేరు : రావి

విశాలాంధ్ర-గుడివాడ : నారా చంద్రబాబు అక్రమ అరెస్ట్ నిరసనగా మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు అధ్వర్యంలో రిలే నిరహారదీక్షలు చెప్పాట్టారు. బుధవారం స్థానిక టిడిపి కార్యాలయంలో నందివాడ మండల నాయకులు రిలే నిరహారదీక్షలు చేస్తున్న వారికి మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు పూలమాలలు వేసి దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసి సైకో జగన్ ఆనందం పొందుతునరని, ఇలాంటి మోసపూరిత అరెస్టులతో భయపడే ప్రస్తకే లేదని, అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేసి, వెంటనే చంద్రబాబు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ, రూరల్, నందివాడ మండల అధ్యక్షులు దింట్యాల రాంబాబు, వాసే మురళీ, దానేటి సన్యాసిరావు, తెలుగుయువత రాష్ట్ర కార్యదర్శి షేక్ ముజాహిద్, సర్పంచ్ కాకర్ల సురేష్, నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షులు గోవాడ శివా, నాయకులు షేక్ జానీషరీఫ్, మజ్జాడ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు

వెనిగండ్ల ఆధ్వర్యంలో రిలే నిరహార దీక్షలు

విశాలాంధ్ర-గుడివాడ : టిడిపి నాయకుడు వెనిగండ్ల రాము అధ్వర్యంలో బుధవారం అయన స్వగృహం వద్ద రిలే నిరహర దీక్షలను నిర్వహించారు ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ చంద్రబాబు వెంటనే విడుదల చేయపోతే ప్రజలు ప్రభుత్వంపై తిరగబడతరన్నారు. ఈ దీక్షలో షేక్ ఇబ్రహీం, గద్దం ప్రకాష్‌దాసు, బొంబాయి శ్రీను, అసిలేటి నిర్మల తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి స్కూల్ గేమ్స్ ప్రారంభం

విశాలాంధ్ర-కూచిపూడి : మండవ కనకయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు రోజులు పాటు జరిగే మండల స్థాయి స్కూల్ గేమ్స్ బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు వేమూరి పరిశుద్ధ రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ క్రీడలు పోటీ తత్వాన్ని పెంపొందింప చేస్తాయని అలాగే మానసిక ఉల్లాసాని కల్గింపచేస్తాయని పేర్కొన్నారు. ఆటల పోటీలలో ఓటమి చెందిన క్రీడాకారులు నిరుత్సాహ పడరాదని, ఓటమి గెలుపుకి తొలి మెట్టని సూచిస్తూ విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు పసుపులేటి శివ కోటేశ్వరరావు. మండల ఎం.ఎస్.డి.ఓ గానున్న పిడి అప్పికట్ల రామారావు, పిడి మండలి మనోహర్.తోపాటు పలు పాఠశాలల పిడి, పి ఈ టి లు పాల్గొన్నారు.

నూతన పింఛన్లు పంపిణీ

విశాలాంధ్ర-కూచిపూడి : లబ్దిదారుల అర్హతనే ప్రామాణికంగా తీసుకుని కుల మతాలకురాజకీయాల కతీతంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పేద వర్గాలకు డాక్టర్ వైఎస్ఆర్ పెన్షన్ కానుక ద్వారా వివిధ పెన్షన్లను అందించి వారి కళ్ళల్లో సంతోషం చూస్తున్నారని పలువురు వక్తలు పేర్కొన్నారు. మండలంలోని 16 సచివాలయాలకు మంజూరైన 235పెన్షన్లను సర్పంచులు,పంచాయతీ పాలకమండలి, సచివాలయ కన్వీనర్లు బుధవారం పంపిణీ చేశారు ఈ సందర్భంగా వారు లబ్దిదారులను ఉద్దేశించి ప్రభుత్వం పెన్షన్ల ద్వారాఅందిస్తున్న చేయూతను వెల్లడించారు. కాగా కూచిపూడి సచివాలయంలో మంజూరైన 9 కొత్త ఫెంక్షన్స్ పంచాయతీ పాలక మండలి సభ్యుడు కావూరి పూర్ణచంద్ర శర్మ,, సచివాలయ కన్వీనర్లు మద్దాల కామేశ్వరరావు, కైలా రజని, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ పి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టుకు నిరసనగా రిలే దీక్షలు

విశాలాంధ్ర-బంటుమిల్లి :- రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశానుసారం పెడన నియోజక టీడీపీ ఇంఛార్జి కాగిత కృష్ణప్రసాద్ న్యాయకత్వంలో టీడీపీ జాతీయ పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా బుధవారం బంటుమిల్లి మండలంలో కార్యకర్తలు రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముందుగా స్వర్గీయ నందమూరి తారకరామారావు చిత్ర పటానికి పుష్ప మాలవేసి ఘనమైన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పెడన నియోజక వర్గ టీడీపి ఇంఛార్జి కాగిత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టు వైసీపీ ప్రభుత్వం యొక్క నిరంకుశ వైఖరికి నిదర్శనమని, ఈ అక్రమ అరెస్టును ఖండిస్తూ మేము సైతం అంటూ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు రిలేదీక్షలు చేపట్టడం జరిగింది అని కాగిత అన్నారు. ఈ కార్యక్రమంలో బంటుమిల్లి మండల పార్టీ అధ్యక్షులు కూనపురెడ్డి వీరబాబు, మండల పార్టీ అధ్యక్షులు ఒడుగు తులసి రావు, పార్లమెంటు కార్యదర్శి ఉమ్మడిశెట్టి శ్రీరామ్‌మూర్తి, మహిళా అధ్యక్షురాలు దాసరి కరుణజ్యోతి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శిలు బొర్రా కాశీ, శీరం ప్రసాద్, వేంకటేశ్వరరావు, పడమట నాగేమల్లేశ్వరమ్మ, పెడన జడ్పిటిసి వెంకట నగేష్, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు ఆకునూరి రత్న కుమార్ నాయకులు పాల్గొన్నారు.

రిలే దీక్షను సందర్శించిన ఎన్టీఆర్ తనయుడు, మనుమడు

విశాలాంధ్ర-పెదపారుపూడి : మాజీ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు అరెస్టుకు నిరసనగా నియోజకవర్గ కేంద్రమైన పామర్రులో రిలే నిరాహార దీక్ష చేస్తున్న ఆ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి వర్ల కుమార్ రాజాకు మద్దతుగా స్వర్గీయ ఎన్టీఆర్ తనయుడు నందమూరి రామకృష్ణ, ఎన్టీఆర్ మనుమడైన గారపాటి శ్రీనివాసులు రిలే దీక్ష శిబిరం వద్దకు చేరి తమ పూర్తి మద్దతు బుధవారం ప్రకటించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఆనాడు ఎన్టీఆర్ పార్టీని స్థాపించి నప్పటినుండి నేటి వరకు ఎన్నో సంక్షోభాలు వచ్చినప్పటికీ వాటిని ఎదుర్కొని అనేక విజయాలు సాధించామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి బీసీ విభాగం రాష్ట్ర నాయకులు వీరంకి గురుమూర్తి, పెదపారుపూడి మండల శాఖ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, కృష్ణా జిల్లా అధికార ప్రతినిధి కలపాల కిషోర్, నాయకులు డి జమ్మిబాబు, తదితరులు పాల్గొన్నారు.

మహాలయ అమావాస్య ప్రత్యేక పర్యాటక రైలు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : భారతీయ రైల్వేలు - భారత్ గౌరవ్ పథకం పేరుతో అత్యంత విజయవంతమైన ప్రైవేట్ రైలు ఉలా రైల్ అధ్వర్యంలో మహాలయ అమావాస్య ప్రత్యేక రైలు ఈనెల 10 నుండి 21 వరకు (11 రోజులు) నడుపుతున్నట్లు తెలిపారు. ఈ రైలు ప్రయాగ్ రాజ్, వారణాసి, గయ, అయోధ్య, హరిద్వార్, ఢిల్లీ, ఆగ్రా, మథుర వంటి ప్రాంతాలను సదర్శిస్తారన్నారు. ఈ ప్రయాణం యాత్రికులందరికీ గొప్ప అనుభూతి పూర్వీకులకు పిండదానంను సమర్పించే అవకాశం కుడా కల్పిస్తారన్నారు. ఈ ప్రత్యేక రైలు మధురై నుండి బయలుదేరి, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, గుంటూరు, మిర్యాలగూడ, నల్గొండ, సికింద్రాబాద్, కాజీపేట స్టేషన్లలో పర్యాటకులు ఎక్కటానికి అవకాశం కల్పించారు. రైలులో దారి పొడవునా యాత్ర విశేషాలను వివరించేందుకు పిఎ సిస్టమ్స్, సిసి కెమెరాలు, కోచ్ సెక్యూరిటీ,టూర్ మేనేజర్‌లు, ట్రావెల్ ఇన్సూరెన్స్, రవాణా, మూడు పూటల దక్షిణ భారత భోజనం సహా వివిధ రకాల సౌకర్యాలను అందజేస్తామన్నారు.

పేదల సంక్షేమమే లక్ష్యం : మంత్రి జోగి

విశాలాంధ్ర-బంటుమిల్లి : రాష్ట్రం ఆర్థిక ఇబ్బందులలో ఉన్నప్పటికీ నిరుపేదల అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా జగనన్న ప్రభుత్వం అహర్నిశలు శ్రమిస్తోందని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. మండల పరిధిలోని గ్రామాల నిరుపేదలకు నూతనంగా మంజూరైన 176 పింఛన్లను మంత్రి జోగి రమేష్ బుధవారం మల్లేశ్వరం మార్కెట్ యార్డులో ఏర్పాటుచేసిన సభ సమక్షంలో పంపిణీచేశారు. ఈ సందర్భంగా మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ దేశంలోని ఏ రాష్ట్రంలో కూడా ఇన్ని పింఛన్లు ఇచ్చిన దాఖలాలు లేవని, అది ఒక్క మన ఆంధ్రరాష్ట్రంలోనే జగనన్న ప్రభుత్వంలోనే సాధ్యమైందన్నారు. మరి ఈ విధానం గత ప్రభుత్వంలో ఎందుకు సాధ్యపడలేదని ప్రతి ఒక్కరు ఆలోచించాలన్నారు. గతంలో పిల్లలను చదివించాలన్నా, రైతులు పంటలు వేసుకోవాలన్న, చిరువ్యాపారులు వ్యాపారం చేసుకోవాలన్న డబ్బులకోసం పెంతందారుల వద్దకువెళ్ళి అప్పులు చేసి అధిక వడ్డీలు చెల్లించి అప్పుల ఊబిలో కురుకుపోయేవారన్నారు. జగనన్న ప్రభుత్వ అధికారం చెపట్టిన దగ్గరనుండి ప్రతి ఒక్క నిరుపేదకు సంక్షేమ పథకాలను అందజేస్తూ అప్పుల ఊబిలోనించి ప్రజలను కాపాడుకోగలిగామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వెలివెల చినబాబు, జడ్పిటిసి మలిశెట్టి వెంకటరమణ, వైసీపీ మండల పార్టీ అధ్యక్షుడు సుజ్ఞానం మహేష్, బంటుమిల్లి సర్పంచి స్థనం కృష్ణవేణి, మల్లేశ్వరం మార్కెట్ యార్డ్ ఉపాధ్యక్షులు పాలడుగుల బాబురావు, మట్ట నాగబాబు, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ సంఘం కార్పొరేషన్ డైరెక్టర్ తిరుమాని శ్రీనివాసరావు, కందుల నాగేశ్వరరావు, పెపెటి వీరబాబు, ఎంపీడీఓ జె స్వర్ణభారతి, తహశీల్దారు ఎం సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాజకీయ కక్షతో చంద్రబాబుపై తప్పుడు కేసులు : వేణు

విశాలాంధ్ర-పెడన : రాజకీయ లబ్ధి కోసం సీఎం జగన్మోహన్‌రెడ్డి కక్షపూరితమైన పనులు చేస్తూ సిఐడి అధికారులతో ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడుపై అక్రమ కేసులు బనాయించారని ఇటువంటి కేసులకు బెదిరేది లేదని రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు అన్నారు. ఈ మేరకు బస్టాండ్ సెంటర్లో బుధవారం తెలుగుదేశం పార్టీ జెండా స్తూపం వద్ద పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో టిడిపి పట్టణ అధ్యక్షులు యక్కల శ్యామలరావు, హమీదుల్ల (గుజరాల్, యర్రా. నాగరాజు,వాహబ్ ఖాన్,తమ్మా. భీమయ్య, పరసా సూర్యనారాయణ, పరసా జితేంద్ర, కమ్మగంటి వెంకటేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

మండలంలో 219 కొత్త పెన్షన్ల పంపిణీ

విశాలాంధ్ర-పెదపారుపూడి : మండలంలో 219 నూతనంగా పెన్షన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో కార్యాలయ ఏవో రమణారావు ఒక ప్రకటనలో బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా మోపర్రు గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ జూపల్లి రాజేశ్వరి, వైసీపీ సీనియర్ నాయకుడు జూపల్లి వెంకటరావు పంపిణీ చేశారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్‌లో విద్యార్థి కీర్తనచత్రియకు మెడల్

విశాలాంధ్ర-గుడివాడ : ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి ఇంటర్ డిస్ట్రిక్ట్ బాస్కెట్ బాల్ చాంపియన్ షిప్‌లో గుడివాడ డా॥కె.కె ఆర్ గౌతమ్ హైస్కూలు విద్యార్థి కీర్తనచత్రియ మూడవస్థానం నిలచి బ్రాంచ్ మెడల్‌ను సాధించినట్లు బుధవారం గౌతమ్ హైస్కూలు ప్రిన్సిపల్స్ సత్యరామ్, లక్ష్మీప్రసాద్, జ్యోతి, జబ్రీనాలు తెలిపారు. కోచ్ మడక సత్యఅన్వేష్ పాల్గొన్నారు.

మెరుగైన పరిష్కారమే ... 'జగనన్నకు చెబుదాం'

విశాలాంధ్ర-మచిలీపట్నం : ప్రజా సమస్యలకు మెరుగైన పరిష్కారమే జగనన్నకు చెబుదాం కార్యక్రమమని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు పేర్కొన్నారు. జగనన్నకు చెబుదాంమండల స్థాయి ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం బుధవారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్, వివిధ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులతో కలిసి నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కొరకు జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తాజా ఉత్తర్వుల ప్రకారం జిల్లాలో ప్రతి బుధవారం, శుక్రవారం మండల స్థాయి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలో తొలిసారిగా ఈరోజు ఉంగుటూరులో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. మండల తాసిల్దారు డి. వనజాక్షి ఎంపీడీవో జిఎస్వి శేషగిరిరావు కార్యక్రమ ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఎం వెంకటేశ్వర్లు, జడ్పీ సీఈవో జ్యోతి బసు, కె ఆర్ ఆర్ సి డిప్యూటీ కలెక్టర్ బి శివ నారాయణ రెడ్డి, గుడివాడ ఆర్డిఓ పద్మావతి, డి ఎల్ డి వో సుబ్బారావు, డ్వామా పిడి జీవి సూర్యనారాయణ వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల అధికారులు పాల్గొన్నారు.

సమస్యలకు నెలవు 'బందర్'!

-అధ్వానంగా పారిశుధ్యం

-వీధిదీపాలు లేక అగచాట్లు

పట్టించుకోని పాలకులు, అధికారులు

విశాలాంధ్ర-మచిలీపట్నం : మన ఆంధ్రప్రదేశ్లో మచిలీపట్నానికి ఎంతో ప్రాముఖ్యత ఉన్నది. మచిలీపట్నం మున్సిపాలిటీ నుండి నగరపాలక సంస్థగా మారింది. మచిలీపట్నం నగరంలో మొత్తం 50 డివిజనల్ గాను పూర్తి మెజార్టీ వైసీపీకి ఉండడంతో నగర రెండవ మేయర్‌గా చిటికిన వెంకటేశ్వరమ్మ బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం బందరు నగర పరిస్థితి పారిశుద్ధ్యం అధ్వానంగా ఉన్నది, దీంతోపాటు డ్రైనేజీ వ్యవస్థ కూడా నీటిపారుదల సక్రమంగా లేకపోవడంతో అస్తవ్యస్తంగా ఉన్నది. సక్రమంగా మురుగు నీరుపారుదల అయ్యేలా చర్యలు తీసుకోవాల్సిన అవశ్యకత ఎంతైనా ఉన్నది దీనివల్ల దోమలు వృద్ధి చెందడం తో కొన్ని ప్రాంతాల్లో నీ ప్రజలు వైరల్ ఫీవర్ ఎక్కువగా ఉన్నందువల్ల ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. అలాగే కొన్ని డివిజనల్ అయితే వీధి దీపాలు లేకుండా పోవడంతో వయసు మళ్ళిన వాళ్ళు పడి దెబ్బతిన్న దాఖలాలు కూడా అనేకం. అది కాకుండా ద్విచక్ర వాహనం దారులు కూడా పడిపోవడం పరిపాటిగా మారింది. ప్రజలు ఏమైనా సమస్యలు చెప్పుకునేందుకు నగర మేయర్ కార్యాలయంలో కొంత సమయాన్ని ప్రజలకు కేటాయిస్తే మేయర్ అన్నివేళలా ప్రజలకు అందుబాటులో ఉన్నారని నమ్మకం ప్రజలలో కలుగుతుంది. నగరంలో లోతట్టు ప్రాంతాలలో నీరు చేరిపోవడం వల్ల అనేక విధాల ఇబ్బందులను ప్రజలు ఎదుర్కొంటున్నారు వీటిని కూడా మేయర్ పరిగణలోకి తీసుకుని అధికారులతో ఆయా ప్రాంతాలను సందర్శించి ఆ నీటిని మోటార్ల ద్వారా తోడించి బ్లీచింగ్ చల్లితే సీజనల్ వ్యాధుల నుంచి ప్రజలకు విముక్తులను చేసినట్టు అవుతుందని ప్రజలు అభిప్రాయం.

టీడీపీ దీక్షకు సీపీఐ నేతల సంఘీభావం

విశాలాంధ్ర-గన్నవరం : టిడిపి జాతీయ నాయకులు నారా చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా బుధవారం గన్నవరం టిడిపి పార్టీ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం దగ్గర నిరసన దీక్ష చేశారు. ఈ దీక్షకు మద్దతుగా సీపీఐ నేతలు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పార్టీ పరిశీలకులు వద్రాన హరిబాబు, ప్రధాన కార్యదర్శి దొంతు చిన్న, మండల అధ్యక్షులు జాస్తి వెంకటేశ్వరవు, అరుమల్ల వెంకట కృష్ణారావు మాజీ సర్పంచి గూడపాటి తులసింహన్, జాస్తి శ్రీధర్, విశ్రాంతి అధ్యపలులు మద్దుకురి విజయకుమార్, యార్లగడ్డ సతీష్, మహిళ నాయకులు సాయి లక్ష్మీ, మండవ లక్ష్మీ, కాట్రగడ్డ అరుణకుమారి, బూసే సరితా, మండల జిల్లా నాయకులుఎస్ విజయకుమార్, సీపీఐ నాయకులు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఉమామహేశ్వరరావు, పట్టణ కార్యదర్శి కాట్రగడ్డ రామచంద్రజోషి, కట్టవరపు విజయరావు, ఎస్ మోహనరావు, కృష్ణారావు, కె మోహన్, సిహెచ్ భవాని ప్రసాద్, సిహెచ్ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక నేరస్తుడు జగన్ ఇగో కోసమే.. మండలి

విశాలాంధ్ర అవనిగడ్డ: ఆర్థిక నేరస్తుడు జగన్ ఇగో శాటిస్ఫాక్షన్ కోసమే ఎలాంటి తప్పు చేయని చంద్రబాబుపై అక్రమ కేసు పెట్టి జైలుకు పంపించారని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు మండలి వెంకట్రామ్ అన్నారు. టీడీపీ పిలుపు మేరకు అవనిగడ్డలో టీడీపీ నాయకులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. మండలి వెంకట్రామ్ దీక్షలు ప్రారంభించగా, మాజీ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్ శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. వెంకట్రామ్ మాట్లాడుతూ చంద్రబాబు, లోకేష్ సభలకు, లోకేష్ పాదయాత్రకు వస్తున్న ప్రజాదరణ చూడలేక చంద్రబాబును వరుస కేసులతో ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. వైసీపీ కుట్రలు ప్రజలకు తెలిశాయని, వచ్చే ఎన్నికల్లో ఈ దుష్ట వైసీపీ పాలకులను ఓడించి తగిన బుద్ధి చెప్పటం ఖాయమన్నారు.

గవర్నర్ పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్

విశాలాంధ్ర-మచిలీపట్నం : రాష్ట్ర గవర్నర్ పర్యటనకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా కట్టుదిట్టంగా ఏర్పాట్లుచేయాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర గవర్నర్ గౌరవ ఎస్ . అబ్దుల్ నజీర్ పర్యటన నేపథ్యంలో బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ మచిలీపట్నం రుద్రవరంలోని కృష్ణ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విశ్వవిద్యాలయంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అకాడమిక్ భవనంలో అల్లూరి సీతారామరాజు ఆడిటోరియంలో వేదిక, సీటింగ్ ఏర్పాట్లు, గవర్నర్ గారు కాసేపు విశ్రాంతి తీసుకునేందుకు పక్కనున్న గ్రీన్ రూము ఏర్పాట్లు, స్వాగత ఏర్పాట్లు పరిశీలించారు. ప్రోటోకాల్ ప్రకారం అన్ని ఏర్పాట్లు పక్కాగా చేయాలన్నారు. ప్రాంగణం పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి. జ్ఞానమణి, రిజిస్ట్రార్ వీర బ్రహ్మచారి, ఆర్డీవో ఐ కిషోర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అందుకోవాలి

విశాలాంధ్ర-కంకిపాడు: గ్రామీణ ప్రాంత పేద విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం పూర్వ విద్యార్థి కొండవీటి వెంకట సురేష్ (ఎన్ఆర్ఐ) సేవలు అభినంద నీయమని గ్రామ ప్రముఖులు నెక్కల పూడిబాలప్రసాద్ అన్నారు. బుధవారం ఎన్ఆర్ఐ కొండవీటి వెంకట సురేష్ ఆధ్వర్యంలో మండలంలోని మంతెన గ్రామంలో మండల పరిషత్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1650 నోటు పుస్తకాలు, జామెంట్రీ బాక్స్ లు, విద్యా సామాగ్రి, కిట్లు పంపిణీ చేశారు. సందర్భంగా నెక్కల పూడి బాల ప్రసాద్ మాట్లాడుతూ అమెరికాలో స్థిరపడిన సురేష్ ప్రతి సంవత్సరం తాను చదువుకున్న పాఠశాల కోసం అందిస్తున్న వితరణ అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకటరమణ, దాత తండ్రి కొండవీటి వెంకటేశ్వరరావు, మామయ్య తాతా వెంకటేశ్వరరావు, వీరంకి దుర్గా నాగేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు రత్నకుమార్, కళ్యాణి, అధ్యాపకులు ఫణీంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : ఎంపీపీ కాసాని

విశాలాంధ్ర-పమిడిముక్కల: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం మని యంపిపి కాసాని వేద సుప్రజ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామాల్లోని ప్రతి ఇంటికి తడి చెత్త,పొడి చెత్త వేసుకునే డబ్బాలను పంపిణీ చేస్తున్నట్లు యంపిడిఓ విఠల్ పాల్ తెలిపారు.ఈ కార్యక్రమంలో వైస్ యంపిపి కొడమంచిలి మహేష్ ఇ.ఓ.పి ఆర్ డి కె.వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పోటీలకు క్రీడా జట్లు

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ శ్రీ మండవకనకయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు రోజులు జరిగే మండల స్థాయి క్రీడా పోటీలలో పలు అంశాలలో జట్లను ఎంపిక చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి ఎన్. శివశంకరరావు బుధవారం సాయంత్రం విలేకరులకు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు త్వరలో జిల్లా స్థాయిలో నిర్వహించే పోటీలకు మొవ్వ మండలంనుంచి ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన జట్ల వివరాలను ఆయన వెల్లడించారు. మండల స్పోర్ట్స్ అథారిటీ అధికారి రామారావు, మండలంలోని పలు పాఠశాలల పిడి, పీఈలు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడా స్ఫూర్తి పెంపొందించుకోవాలి

విశాలాంధ్ర-పమిడిముక్కల: విద్యార్థులు పాఠ్యాంశాలు తో పాటు క్రీడా స్ఫూర్తి ని పెంపొందించుకొని ఉత్తమ పౌరులుగా ఎదగాలని పమిడిముక్కల హైస్కూల్ హ హెచ్ఎం వి.కేశవ నారాయణ అన్నారు.బుధవారం మండల స్థాయిలో పలు క్రీడలలో పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తాడంకి కపిలేశ్వరపురం పమిడిముక్కల అగినపర్రు మేడూరు ఐనపూరు చోరగుడి పాఠశాలల నుంచి 130 మంది బాల బాలికలు కు వాలీబాల్ కబడ్డీ లలో పోటీలు నిర్వహించగా వాలీబాల్ కు 24, కబడ్డీ కి 48 మంది సెలెక్ట్ అయ్యారని మండల పి.డి. ఇన్చార్జి ఇ.వి.నారాయణ తెలిపారు.వీరు నియోజకవర్గ స్థాయిలో ఆడాలని గెలుపొందితే తరువాత జిల్లా స్థాయిలో ఆడాలన్నారు.

సవరణ క్లైమ్స్‌లో నిబంధనలు పాటించాలి

విశాలాంధ్ర-కూచిపూడి : మండలం లోని పోలింగ్ కేంద్ర అధికారులు సవర ణలవిషయంలో అలసత్వం వహించకుండా వివాదాలకు తావివ్వకుండా వ్యవహరిం చాలని తహశీల్దార్ సీహెచ్ వీరాంజనేయ ప్రసాద్ సూచించారు. మొవ్వ తహసిల్దార్ కార్యాలయంలో బుధవారం మండలంలోని 54 పోలింగ్ కేంద్రాలలో ని అధికారులకు సమావేశం నిర్వహించి పలుసూచనలు ఇచ్చారు. ప్రతి బిఎల్వోలు తమ పరిధిలో గల డెత్ క్లైములను పూర్తి వివరాలతో త్వరితగతిన అందజేయాలని, అయితే మరణ ధ్రవపత్రాలు లేని వారికి ఆ ప్రాంతాల వారితో పంచనామా నిర్వహించి ఆ పత్రాలను సమర్పించాలని వివరించారు. జులై 21 నుంచి సమగ్ర ఓటర్ల సర్వే కోసం నిర్వహించిన, డోర్ టు డోర్ క్యాంపైన్లో వచ్చినచేర్పులు, మార్పులు, సవరణలు, స్పష్టంగా ఉండాలనీ సూచించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు సమగ్ర సర్వే ద్వారా 393, తొలగింపు 92, సవరణలు 134 వచ్చాయన్నారు. అదేవిధంగా 2022వ సంవత్సరం నుంచి తొలగింపులు 2,461 వచ్చాయని వీటిని ఉన్నతాధికారులు సైతం పరిశీలిస్తున్నారని వెల్లడించారు. చేర్పులు, తొలగింపులు, మార్పులు, సవరణలు చేసే సమయంలో బిఎల్‌వోలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్స్ సిహెచ్ గోపాల రావు (డిటీ), ఈడే విజయలక్ష్మి (ఆర్ ఐ) పాల్గొన్నారు.

కార్మికుల వేతనాలు చెల్లించక పోవడం దుర్మార్గం : గోవర్ధన్

విశాలాంధ్ర-అవనిగడ్డ: 6 నెలుగా స్థానిక పంచాయతీ కార్యాలయంలో పనిచేస్తున్న వివిధ విభాగాలకు చెందిన 53 మంది కార్మికులకు జీతాలు ఇవ్వకపోవడంతో తీవ్ర దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నారని జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు గోవా గోవర్ధన్ బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఆందోళన వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్ పద్ధతిపై పనిచేస్తున్న ఈ కార్మికులలో పారిశుధ్య విభాగం మంచినీటి సరఫరా విభాగం ట్రెన్స్ విభాగాలలో ఉన్నారు నిత్యం పరిసరాలు డ్రైనేజీల పరిశుభ్రత దోమల నివారణకు సంబంధించి అపరిశుభ్రత దుర్గ అందాల మధ్య విధులు నిర్వహిస్తూ ప్రజలకు ఆరోగ్యాన్ని అందిస్తున్న కార్మికులకు సకాలంలో వేతనాలు ఇవ్వకపోవడం క్షమించరాని నేరమని గోవర్ధన్ అన్నారు. ఆర్థిక పరిస్థితి సరిగాలేని నాలుగవ తరగతి కార్మికులకు ప్రతినెల విధిగా వారి గౌరవ వేదం చెల్లించాలని ఆర్థిక విసులబాటు ఉన్న ఉన్నతాధికారులకు క్రమంగా జీతాలు ఇచ్చే విధానం దిగువ స్థాయి కార్మికులకు ఇవ్వకపోవడం ప్రభుత్వ తప్పిదంగా పరిగణించాలని వెనుకబడిన షెడ్యూలు కులాల వారు ఎక్కువగా ఉండే పారిశుధ్య కార్మికుల జీతాల విషయంలో ఈ విధానం తగదన్నారు. ఈ విషయంలో జిల్లా మండల స్థాయి అధికారులు తక్షణమే స్పందించి వేతనాల బట్వాడాకు చొరవ చూపించాలని లేనిచో ఆందోళన చేయవలసి వస్తుందని అన్నారు.

ప్రపంచ పర్యాటకులను ఆకర్షించేలా
అంబేద్కర్ స్మృతివనం

సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : ప్రపంచ పర్యాటకులను ఆకర్షించేలా విజయవాడలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేయనున్న డా.బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని భారత రాజ్యంగా ముసాయిదా ప్రతుల ఆమోదం రోజైన నవంబర్ 26న రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రారంభించి ప్రజలకు అంకితం చేయనున్నారని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున తెలిపారు. విజయవాడ స్వరాజ్ మైదానంలో నిర్మాణంలో ఉన్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం, స్మృతివనం నిర్మాణ పనులను మంత్రి బుధవారం పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత, పేద, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని విజయవాడ నడి బొడ్డున ప్రపంచ పర్యాటకులను ఆకర్షించేలా ఏర్పాటు చేస్తున్నామన్నారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న అంబేద్కర్ విగ్రహం దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోనున్నదన్నారు. ప్రతిరోజూ 500 మందికిపైగా కార్మికులు అంబేద్కర్ 125 అడుగుల విగ్రహం స్మృతివనం పనులు పూర్తి చేసేందుకు నిమగ్నమయ్యారన్నారు. రూ.400 కోట్లుతో నిర్మించే అతిపెద్ద విగ్రహ నిర్మాణ పనులు పూర్తయ్యాయని, విగ్రహానికి రంగులతో తుది మెరుగులు దిద్దాల్సి ఉందన్నారు. విగ్రహం కింది భాగంలో నాగులు ఏసి హాల్‌లు నిర్మిస్తున్నామని, వాటిలో ఒక హాల్‌లో అంబేద్కర్ జీవిత చరిత్రకు చెందిన చిత్రాలను ప్రదర్శించేలా మిని థియేటర్ ఏర్పాటు, మిగిలిన మూడు హాల్స్‌లో అంబేద్కర్ బాల్యం, విద్య, ఉద్యోగం, రాజకీయ జీవితం, పోరాటం రాజ్యాంగ నిర్మాణంలోని ఘట్టాలకు సంబందించిన ఛాయ చిత్రాలు, వస్తువులను ప్రదర్శించేందుకు మ్యూజియంను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దేశ వ్యాప్తంగా సందర్శకులు అంబేద్కర్ విగ్రహా స్మృతి వనాన్ని సందర్శించేలా ఏర్పాట్లుతో పాటు ప్రతిరోజూ దాదాపు వేలాదిమంది పర్యాటకులతో అతిపెద్ద పర్యాటక కేంద్రంగా రూపు దిద్దుకోనుందన్నారు. ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ జయలక్ష్మి మాట్లాడుతూ ప్రపంచ సందర్శకులకు వేదిక కానున్న డా.అంబేద్కర్ విగ్రహం స్మృతివనంలో డిజిటల్ మ్యూజియం, మినీ థియేటర్, లైటింగ్, గ్రానైట్, పాత్ వే, వాటర్ ఫౌంటైన్, వెహికల్ పార్కింగ్, ఎలక్ట్రిసిటీ పనులు ల్యాండ్ స్కేపింగ్,సుందరీకరణ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. నిర్మాణా పనులను రానున్న 2నెలల్లో పూర్తిచేసి ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమీషనర్ స్వప్నిల్ దినకర్ పుడ్కర్, ఏపీ ఐఐసీ సీఇ నరసింహారావు, జోనల్ మేనేజర్ సీతారాం, డీజీఎం రహీమ్, కేపీసీ పీడీ పీ.సుదేవరావు. ప్రాజెక్ట్ మేనేజర్లు కే.కృష్ణమోహన్, జావీద్ పాల్గొన్నారు.

సీఎం జగన్‌ను కలిసిన వక్ఫ్ బోర్డ్ డైరెక్టర్ ఖాజా

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ డైరెక్టర్ షేక్ ఖాజా బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ నెల 9న వక్ఫ్ బోర్డ్ డైరెక్టర్ (ముతావల్లి కోటా)గా షేక్ ఖాజా విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విజయవాడ ఏ-కన్వెన్షన్ సెంటర్ లో జరిగిన ఒక కార్యక్రమంలో సీఎం జగన్ ను ఖాజా కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ రుహుల్లా కూడా సీఎంను కలిసిన వారిలో ఉన్నారు.

విశాలాంధ్ర
ఎన్టీఆర్ జిల్లా

నీరు నిలవకుండా చర్యలు : మేయర్

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : నగరంలో కురిసిన వర్షాలకు వర్షం నీరు నిలవకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే వీ.శ్రీనివాసరావు, నగర మేయర్ ఆర్.భాగ్యలక్ష్మి తెలిపారు. రెండు రోజుగా కురుస్తున్న వర్షాలకు 41వ డివిజన్‌లో 72 పాకల ఏరియా 43వ డివిజన్‌లోని ఓల్డ్ హెచ్ బీ కాలని, 44వ డివిజన్‌లోని లేబర్ లేబర్ కాలని, 53వ డివిజన్‌లోని నూర్ ఉల్ హక్ వీధి తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే, మేయర్ బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షం నీరు నిలిచే ప్రాంతాలున్నాయో వాటిని అభివృద్ధి పర్చాలని ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. నియోజకవర్గ స్థాయిలో అన్ని పాత కాలువలను కొన్నిటిని అభివృద్ధి చేసామని ఇంకా కొన్ని చోట్ల కాలువలు అభివృద్ధి చెయ్యాల్సి ఉందని, వాటిని త్వరితగతిన అభివృద్ధి చేసేందుకు కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. గతంలో గణపతిరావు రోడ్, కేటీ రోడ్ ముంపుకు గురి అయ్యేవని నేడు ఆ పరిస్థితిలేదని, ముంపు లేకుండా అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. నగర అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, రోడ్లు, డ్రెయిన్లు అభివృద్ధి పరుస్తున్నమాన్నారు. గడప గడపకి వెళ్ళిన సమయంలో మా దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు ఎండీ.ఇర్ఫాన్, బీ.కోటిరెడ్డి, ఎం.రత్నకుమారి, దుర్గారావు, ఎం.అప్పాజీరావు, ఎస్.పూర్ణచంద్రరావు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారధులు, వీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

వినాయక చవితి పందిళ్ల అనుమతికి సింగిల్ విండో కౌంటర్

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): వినాయక చవితి పందిళ్ళ కోసం సింగల్ విండో కౌంటర్ ఏర్పాటు చేసినట్లు డీసీపీ విశాల్ గున్ని బుధవారం ఒక ప్రకటన తెలిపారు. జిల్లాలో వినాయక పందిళ్ళు ఏర్పాటు చేసుకునే ఉత్సవ నిర్వాహకులు తప్పని సరిగా ముందస్తు పోలీసు అనుమతి పొందాలని పేర్కొన్నారు. ఉత్సవ నిర్వాహకులకు సమయం తక్కువగా ఉండి, వివిధ శాఖలు అయిన మున్సిపల్/పంచాయతీ, ఫైర్ డిపార్ట్‌మెంట్, ఎలక్ట్రిసిటీ శాఖ, పోలీసుల అనుమతులకి ఆయా శాఖల వద్దకు వెళ్ళడం కష్టతరంగా ఉంటుందని గమనించిన నగర పోలీస్ కమిషనర్ కాంతి రాణా టాటా అన్ని శాఖల సమన్వయంతో ఉత్సవ నిర్వాహకుల సౌకర్యార్ధం వినాయక చవితి పందిళ్ళ ఏర్పాటు నిమిత్తం అన్ని శాఖల అధికారులందరితో కలిసి ఒకే ప్రదేశంలో అనుమతులకు ఆర్జీలను స్వీకరించి అనుమతుల ఏర్పాట్లు చేశారన్నారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంకు ఎదురుగా ఉన్న కమాండ్ కంట్రోల్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సమీకృత పోలీస్ సేవా కేంద్రం (యూపీఎస్‌సీ)లో అన్ని వివరాలతో దరఖాస్తులు సమర్పించాలని, సమర్పించిన దరఖాస్తులు ఆయా శాఖల అధికారులు పూర్తిగా పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తారని తెలిపారు. ఈనెల 14వతేదీ నుంచి ప్రతి రోజు ఉదయం 10గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు.

స్తంభాన్ని ఢీకొన్న లారీ

విశాలాంధ్ర-వీరులపాడు : జయంతి గ్రామంలో బుధవారం సిమెంటు లోడు లారీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో స్తంభం నేలకొరిగింది. సకాలంలో విద్యుత్ సిబ్బంది స్పందించడంతో పెనుప్రమాదం తప్పింది. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఎదురుగా ఈ ఘటన జరుగడం, ఆ సమయంలో విద్యార్థులు ఎవ్వరూ అక్కడ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో సెలక్షన్

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : కెవిఆర్ పాఠశాలలో మంగళవారం మండల స్థాయిలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో కబడ్డీ, ఖో ఖో, వాలిబాల్, టెన్ని కాయిట్, బాల్ బ్యాడ్మింటన్, త్రో బాల్, షటిల్ బ్యాట్ మెంటేన్ తదితర ఆటలపోటీలు నిర్వహించారు. విజేతలు ఈ నెల 22న నియోజకవర్గ స్థాయిలో జగ్గయ్యపేటలో పోటీల్లో పాల్గొంటారని హెచ్ఎం కె.జలజ, ఎస్‌జీఎఫ్ మండల ఇంచార్జ్ వేగినేటి వెంకటరమణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రవీంద్రనాయక్, నియోజకవర్గం ఇంచార్జ్ ఎం.శ్రీనివాసరరావు, గంటా వెంకటేశ్వరరావు, బాబు ప్రసాద్, పేరెన్స్ కమిటీ చైర్మన్ బత్తుల వెంకట్ నర్సు పాల్గొన్నారు.

పోషకాహార మాసోత్సవాలు

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : పోషకాహార మాసోత్సవాలు సెప్టెంబర్ 1వ తేదీ నుండి 30వ తేదీ వరకు జరగనున్న సందర్భంగా పెనుగంచిప్రోలులోని అంగన్వాడీ సెంటర్12లో సిడిపి ఓ.లక్ష్మి భార్గవి ఆదేశాల మేరకు సూపర్ వైజర్ ఉష మంగళవారం అతి తక్కువ ఖర్చుతో చిరు దాన్యలతో ఆహారంలో ఎలా ఉపయోగించుకోవాలలో వాటితో రకరకాల వంటకాలు ఎలా చేసుకోవాల్లో బాలింత తల్లులకు గర్భిణీలకు సిడిపిఓ, డాక్టర్ ఇందిరా, సూపర్ వైజర్ ఉష అవగాహన కల్పించారు.

ఏపీ టూరిజం ఎక్స్‌లెన్స్ అవార్డులకు దరఖాస్తులు : అరుణ

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : ఏపీ టూరిజం ఎక్స్‌లెన్స్ అవార్డులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పర్యాటక సాంస్కృతిక అధికారి ఆర్.అరుణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27వ తేదీన నిర్వహించనున్న ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఎక్స్‌లెన్స్ అవార్డులను ప్రధానం చేయనున్నట్లు తెలిపారు. ట్రావెల్, టూరిజం ఇండస్ట్రీలోని వివిధ రంగాల్లో ఉత్తమ సేవలందించి ప్రతిభ కనపర్చిన, సేవలు అందిస్తున్నవారు ఈ నెల 19వ తేది సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులను అందజేయాలని తెలిపారు. ఇతర వివరాలకు www.aptourism.gov.in వెబ్ సైట్‌ను సందర్శించాలని సూచించారు.

పాస్టర్లకు గౌరవ వేతనం హర్షం

విశాలాంధ్ర విజయవాడ (లబ్బీపేట): రాష్ట్ర ప్రభుత్వ మైనారిటీ వ్యవహాల శాఖ ద్వారా పాస్టర్లకు ఈరోజు 5 నెలల గౌరవవేతనం రూ.25 వేలు జమచేశారని రాష్ట్ర క్రిష్టియన్ జెఏసి చైర్మన్ డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్ ఒక ప్రకటనలో తెలిపారు. పాస్టర్లకు అయిదు నెలల గౌరవవేతనన్ని వారి ఖాతాలోకి నేరుగా జమశారని పెర్కొన్నారు.

వ్యవస్థలను మేనేజ్ చేస్తున్న జగన్ : బుద్ధ వెంకన్న

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్): జగన్ ప్రభుత్వాన్ని అడ్డం పెట్టుకొని వ్యవస్థలను మేనేజ్ చేస్తున్నారని టిడిపి నాయకులు, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ వెంకన్న విమర్శించారు. టిడిపి జాతీయ నాయకులు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును వ్యతిరేకిస్తూ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా విజయవాడ పశ్చిమ నియోజకవర్గం బుద్ధ వెంకన్న, బీసీ సంక్షేమ నాయకులు రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల మీరా మరియు నియోజకవర్గ డివిజన్స్ నాయకులు, కార్యకర్తలతో కలిసి తమ కార్యాలయం వద్ద నిరాహార దీక్ష చేపట్టారు. ముందుగా వెంకన్న విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేశారు కాబట్టే దేశవ్యాప్తంగా సంచలనంగా మారి నాగుల్ మీరా మాట్లాడుతూ సంఘీభావంగా ది క్లాత్ మర్చంట్ అసోసియేషన్ ముఠా వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు చీపుల సత్యనారాయణ, ప్రజానాట్యమండలి గాయకులు పిచ్చయ్య, ముఠా కార్మికులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వెంకటేశ్వరరావు(చంటి), కాంద్రేగుల రవీంద్ర, సాదరబోయిన ఏడుకొండలు, కామా దేవరాజు, కొట్టేటి హనుమంతరావు, పత్తి నాగేశ్వరరావు, గుర్రం కొండ, నాగోతి రామారావు, తుపాకుల రమణమ్మ, కంప గంగాధర్ రెడ్డి, లోకేష్, ఫణీంద్ర, పెద్ద ఎత్తున తెలుగు మహిళా యువత నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రిలే నిరాహార దీక్షలు చేపట్టిన దేశం నాయకులు

విశాలాంధ్ర-నందిగామ : నందిగామ మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సౌజన్యంతో తెలుగుదేశం రాష్ట్ర పార్టీ ఆదేశానుసారం (బాబు గారికి తోడుగా ఒక నియంత పై పోరాటం కోసం మేము సైతం) అనే కార్యక్రమంలో భాగంగా రైతు పేట లోని టిడిపి కార్యాలయంలో బుధవారం దేశం శ్రేణులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా దేశం శ్రేణులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కక్షపూరితంగా చంద్రబాబు నాయుడు పైఅక్రమ కేసులు బనాయించారని చంద్రబాబు నాయుడు పై వైసిపి వారు ఎన్ని కేసులు పెట్టుకున్నఏమీ కాదని కడిగిన ఆణి ముత్యము లా చంద్రబాబు బయటికి వస్తారన్నారు. వైసిపి వారు తెలుగుదేశం పార్టీని అణిచివేయాలని మీరు చేసే ప్రయత్నాలను తిప్పికొడతామని మీరు ఎంత అణిచి వేయాలనిచూస్తే మా ఉద్యమాలు అంతకు అంత తీవ్ర రూపం దాలుస్తాయని దేశం నాయకులుతెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టిడిపి నాయకులు వడ్డేల్లి సాంబశివరావు, షేక్ కాజా, కాసర్ల లక్ష్మీనారాయణ, మన బోతుల శ్రీనివాసరావు, చిత్తూర్ కిషోర్, దామాల రవి, కాసర్ల లక్ష్మీనారాయణ (బుల్లబ్బాయి,) టిడిపి మహిళా నియోజకవర్గ కార్యదర్శి పేరకలపాడు సర్పంచ్ మన్నే సాత్విక ,టిడిపి కౌన్సిలర్లు మహిళా నేతల తో కలిసి నందిగామ మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య రిలే నిరాహార దీక్షకు సంఘీభావం తెలిపారు.

హరికథా పితామహునికి కథాగాన నీరాజనాలు

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : ఆదిభట్ల నారాయణదాస శిష్య ప్రశిష్య సంఘం, అన్నమయ్య పరివారం, ప్లాంజెరి శంకరనారాయణలు సంయుక్తంగా ఐదు రోజులు పాటు సత్యనారాయణపురం శ్రీ సీతారామ కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్న హరికథా పితామహుని 159వ జయంత్యుత్సవంలలో హరి కథకులు ఆదిభట్ల వారికి హరికథా గాన నీరాజనాలర్పిస్తూ కథా గానాలు చేశారు. ఇదే వేదికపై సంఘం వారు వయోలిన్, మృదంగ విద్వాంసులు పాలపర్తి ఆంజనేయశాస్త్రికి వాయులీన విద్వన్మణి, బెజ్జంకి సాంబశివరావుకు మృదంగ వాద్య విశారద బిరుదులను ప్రదానం చేసి సత్కరించారు. బుధవారం ఉదయం ఆదిభట్ల వారి విగ్రహానికి, కళా వేదికపై ఆదిభట్ల వారి, కైవల్యానంద సరస్వతీ స్వామి వారి, నేతి లక్ష్మీనారాయణ భాగవతుల వారి చిత్రపటాలకు మృదంగ విద్వాంసులు అమ్ముల ప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి ఐదవ రోజు ఉత్సవమును ప్రారంభించారు. సాయంత్రం జరిగిన ఆదిభట్ల వారి జయంత్యుత్సవ వేదికపై వై వెంకటేశ్వర్లు భాగవతార్ కు సన్మానం జరిగింది. డాక్టర్ కప్పగంతు రామకృష్ణ, నిడుమోలు రమా సత్యనారాయణ ఆదిభట్ల నారాయణదాసు హరికథ కళకు ఉత్కృష్ట స్థానాన్ని తీసుకొచ్చారని హరికథకులందరికీ ఆయన ఆరాధ్యుడని నీరాజనాలర్పించారు.

అనాథలకు ఫ్రూట్స్, బ్రెడ్స్ పంపిణీ

విశాలాంధ్ర-విజయవాడ (చిట్టినగర్): హీరో గోపీచంద్ తనయుడు విరాన్ కృష్ణ బాబు జన్మదిన సందర్భంగా టి కృష్ణ సాంస్కృతిక కళా పీఠం ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి సురేష్, అధ్యక్షులు మారపాక రాంబాబు ఆధ్వర్యంలో బుదవారం రాఘవయ్య పార్కు వద్ద నిర్మల్ హృదయ భవన్‌లోనీ నిరుపేద అనాథలకు ఫ్రూట్స్ బ్రెడ్స్ పంపిణీ కార్యక్రమానికి సీపీఐ నగర సహాయ కార్యదర్శి నక్క వీరభద్రరావు, ప్రజానాట్యమండలి నగర అధ్యక్షులు ఎస్.కె నజీర్ లు పాల్గొని మాట్లాడుతూ టి కృష్ణ మరణాంతరం సాంస్కృతిక కళాపీఠం ఏర్పాటుచేసి ప్రతి సంవత్సరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, ఈ భవన్ లోనే గత సంవత్సరం కూడా సేవా కార్యక్రమాన్ని నిర్వహించారని గుర్తు చేశారు. సేవా దృక్పథంతో నిరుపేదలకు, అనాథలకు అండగా ఉండటమనేది గర్వించదగ్గ విషయమని, టి కృష్ణ స్ఫూర్తితో మరింత సమాజ అభివృద్ధికి సాంస్కృతిక వేదిక తోడ్పడాలన్నారు.

'అక్కినేని' సెంటినరీ అవార్డ్స్ పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): దివంగత నటులు అక్కినేని నాగేశ్వర రావు శతజయంతిని పురస్కరించుకొని ఫిలిం అండ్ టెలివిజన్ ప్రమోషన్ కౌన్సిల్ అఫ్ ఇండియా, తెలుగు సినిమా వేదిక సంస్థలు సినీ రంగంతో పాటు వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందించిన వారిని ఏ ఎన్ ఆర్ సెంటినరీ పాన్ ఇండియా అవార్డ్స్ పేరిట ఈ నెల 20వ తేదీన హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్ ఆడిటోరియంలో సత్కరించనున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని శతజయంతి వేడుక పోస్టర్‌ని మాజీ కేంద్రమంత్రి పురందేశ్వరి విజయవాడ లో ఆవిష్కరించారు. హైదరాబాద్ లో జరిగే ఈ వేడుకకు ముఖ్య అతిథిగా విచ్చేయనున్న పురందేశ్వరి మాట్లాడుతూ తనకు బాబాయి వంటి మహానటులు అక్కినేని శతజయంతి వేడుకకు ఆహ్వానించడం చాలా ఆనందంగా వుంది.దేశవ్యాప్తంగా వివిధ రంగాలకు చెందిన ప్రముఖులకు అందించే ఈ సత్కారం మేధావి అయిన బాబాయికి నిజమైన నివాళి అని అన్నారు. ఎఫ్ టి పీ సీ ఇండియా అధ్యక్షులు చైతన్య జంగా మాట్లాడుతూ జాతీయ స్థాయిలో సుపరిచితులైన ఏ ఎన్ ఆర్ వేడుకను పాన్ ఇండియా స్థాయిలో నిర్వహిస్తున్నామని , ఈ వేడుక నిర్వహించడాన్ని ఓ ఛాలెంజ్ గా తీసుకొని బహు రాష్ట్రాల సినీ సామాజిక రంగలవారిని సత్కరించనున్నామని అన్నారు. తెలుగు సినిమా వేదిక వ్యవస్థాపకులు వీస్ వర్మ పాకలపాటి మాట్లాడుతూ తెలుగు చలన చిత్ర పరిశ్రమ మూల స్తంబాలలో ఒకరైన అక్కినేని గారి శతజయంతి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నామని అన్నారు. ఈ కార్యక్రమం లో ప్రముఖ న్యూరో సర్జన్ పువ్వాడ రామకృష్ణ, మాజీ జిల్లా పరిషత్ అధ్యక్షులు పాతూరు నాగభూషణం, డాక్టర్ రాంచంద్ పాల్గొన్నారు.

తొలిసారి 20 వేల మైలురాయిని అధిగమించిన నిఫ్టీ 50

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): నిఫ్టీ 50 తొలిసారిగా 20 వేల మైలురాయిని అధిగమించింది. ఈ సందర్భంగా నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఎండి, సీఈఓ ఆశిష్‌కుమార్ చౌహాన్ మాట్లాడుతూ "భారతదేశం ఇష్టమైన స్టాక్ ఇండెక్స్ నిఫ్టీ 50, నేడు చారిత్రాత్మక, ముఖ్యమైన మైలురాయిని చేరుకుంటూ 20 వేల మార్క్‌ను అందుకుంది. గత 27 సంవత్సరాలలో నిఫ్టీ 50 యొక్క పురోగతి, మరీ ముఖ్యంగా ప్రారంభ సూచీలు వెయ్యి వద్ద ప్రారంభించబడినప్పటి నుండి, దేశం క్యాపిటల్ మార్కెట్లలో భారతీయ, విదేశీ పెట్టుబడిదారులు ఉంచిన నమ్మకానికి, దాని నియంత్రణ, న్యాయ వ్యవస్థ న్యాయమైన, సమర్థవంతమైన, పారదర్శకమైన, తక్కువ ఖరీదు, ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే, క్రమబద్ధమైన మార్కెట్ ప్లేస్ గా నిలిచింది.

గంపలగూడెంలో నూతన పింఛన్లు పంపిణీ

విశాలాంధ్ర-గంపలగూడెం : గ్రామ సచివాల య పరిధిలో వైఎస్ఆర్ పెన్షన్ కానుక పథకంలో భాగంగా 44 కొత్త పింఛన్లు లబ్ధిదారులకి బుధవారం నాడు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కోట .పుల్లమ్మ, ఎంపీడీవో ఎర్రమల. పిచ్చి రెడ్డి, గ్రామపంచాయతీ ఈవో జి. శ్రీనివాస రెడ్డి , వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వార్డు మెంబర్లు ,సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

సీఎం వీడియో కాన్ఫరెన్సులో నగర, జిల్లా అధికారులు

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : స్థానిక నగరంలోని జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలోని వీసీ హాల్ నుంచి నగర పాలక సంస్థ కమీషనర్ స్వప్నిల్ దినకర్ పుడ్కర్, డీఎం అండ్ హెచ్ఓ డా.ఎం.సుహాసిని, నగర పాలక సంస్థ చీఫ్ మెడికల్ ఆఫీసర్ రత్నావళి, డీఇవో సీవీ.రేణుక, ఐసీడీఎస్ పీడీ జీ.ఉమాదేవి, ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ జే.సుమన్, వివిధ శాఖల అధికారులు బుధవారం సీఎం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమం : ఎంపీపీ కోటేరు లక్ష్మి

విశాలాంధ్ర-వీరులపాడు: అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తు రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాతుందని మండల ఎంపీపీ కోటేరు లక్ష్మి అన్నారు. వీరులపాడు మండలం పెద్దాపురం గ్రామంలో గ్రామ,వార్డు సచివాలయం వద్ద నూతనంగా మంజూరైన వైయస్సార్ పెన్షన్ లను లబ్ధిదారులకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల పరిధిలో నూతనంగా 380 పైగా వైయస్సార్ పెన్షన్ లను లబ్ధిదారులకు అందజేయనున్నట్లు ఆమె అన్నారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ ఆవుల రమేష్, మాజీ జడ్పిటిసి సభ్యులు కోటేరు ముత్తారెడ్డి,గ్రామ సర్పంచ్ నిప్పుపల్లి శాంతమ్మ,సొసైటీ అధ్యక్షులు ఆవుల ప్రసాదు నాయకులు పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ చేసిన వైస్ ఎంపీపీ చాట్ల రాబర్టు

విశాలాంధ్ర-రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండల కేంద్రంలో నూతనంగా మంజూరైన సామాజీక పెన్షనలనువైస్ ఎంపీపీ చాట్ల రాబర్టు, సర్పంచ్ మల్లాది రాణీలతో కలసి బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాబర్టు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నాడు లేని విధంగా అర్హతే ప్రామాణీకంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం సామాజీక పెన్షనను మంజూరు చేసిందని తెలిపారు. రెడ్డిగూడెం మండలంలో నూతనంగా డప్పు కళాకారులు, వితంతువులు, వికలాంగులు, మొదలైన 304 పెన్షన్లను మంజూరయ్యాయని ఇంకా అర్హులైన వారందరికి పార్టీలకు అతీతంగా పింఛన్లు మంజూరు చేసేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో రెడ్డిగూడెం ఎంపీటీసీ సభ్యులు కుప్పిరెడ్డి వర ప్రసాద్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షులు బత్తుల శ్రీనివాస్‌రెడ్డి, రైతు ఉత్పత్తి దారుల సంఘం మండల అధ్యక్షులు ఉయ్యూరు సత్యనారాయణరెడ్డి, వైఎస్సాఆర్ కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షులు బలగాని తిరుపతిరావు, సచివాలయ కన్వీనర్లు ఉయ్యూరు భరత్‌కుమార్‌రెడ్డి, గోపిరెడ్డి, కొప్పుల రమణకుమారి, ఏడోవార్డు మెంబర్ చాట్ల ఇమ్మానుయేలు తదితరులు పాల్గొన్నారు.

అక్కినేని శత జయంతి వేడుకలు ప్రభుత్వం నిర్వహించాలి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): భారతదేశంలో అగ్రనటుడు అత్యున్నత కేంద్ర ప్రభుత్వ పురస్కారాలు అందుకున్న నటసామ్రాట్ డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి ఉత్సవాలు సెప్టెంబర్ 20న ప్రారంభం అవుతున్నాయని డాక్టర్ బ్రహ్మాదేశం సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ బ్రహ్మాదేశం అన్నారు. ఈ తరుణంలో విజయవాడ నగరంలో కళాకారులు నిలయం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో లెజెండ్ దాదాఫాల్కేఅవార్డు గ్రహీత అక్కినేని నాగేశ్వరరావు శిలా విగ్రహం లేకపోవడం గ్రహించి డాక్టర్ బ్రహ్మ దేశం సోషల్ సర్వీస్ సొసైటి ద్వారా దఫాలుగా మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ రాయన భాగ్యలక్ష్మీ దృష్టికి అనేక విజ్ఞాపన పత్రాలు అందజేశారు. తద్వారా శిలా విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని సొంత ఖర్చులతో నిర్మించాలని చెప్పటం జరిగింది. సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్కే రోజా దృష్టికి కూడా తెలుసుకుని వెళ్లి వినతి పత్రం అందజేయడం జరిగిందన్నారు. లెజెండ్ ఆర్టిస్ట్ నటసామ్రాట్ శతజయంతి ఉత్సవాలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికార పూర్వకంగా ఘనంగా నిర్వహించాలని సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ బ్రహ్మా దేశం, ప్రధాన కార్యదర్శి కొండాయిగుంట రాము, కోశాధికారి గుర్రం ఏడుకొండలు అభిమానులు తరుపున కోరారు.

17న పెరియార్, తాపీ ధర్మారావుల జయంతి సభ

విశాలాంధ్ర-విజయవాడ : హేతువాద ఉద్యమ పితామహులు పెరియార్ రామస్వామి, అరసం వ్యవస్థాపక అధ్యక్షులు తాపీ ధర్మారావుల జయంతి పురస్కరించుకుని అభ్యుదయ రచయితల సంఘం (అరసం) ఆధ్వర్యంలో ఈ నెల 17 ఆదివారం ఉదయం స్థానిక చంద్ర రాజేశ్వరరావు గ్రంధాలయం నందు సాహిత్య సభ నిర్వహిస్తున్నట్లు అరసం ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి పరుచూరి అజయ్ కుమార్, కార్యదర్శి మోతుకూరి అరుణ కుమార్‌లు తెలిపారు. అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ ముఖ్యవక్తగా పాల్గొంటారని పేర్కొన్నారు. ఇటీవల అరసం ప్రచురించిన మణిపూర్ మంటలు, అక్షరమా నీకు వందనం, పుస్తకాల పరిచయం కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈ సభకు సాహిత్య అభిమానులు, రచయితలు హాజరై విజయవంతం చేయగలరని అజయ్‌కుమార్ కోరారు.

15వ డివిజన్‌లో నూతన పింఛన్లు పంపిణీ

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : తూర్పు నియోజకవర్గం 15వ డివిజన్ రామలింగేశ్వరనగర్ లోని 68, 69, 70, 71, 72 సచివాలయాల పరిదిలో నూతనంగా మంజూరయిన 60 పెన్షన్లను నగర డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ బుధవారం పింఛను దారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పజలు జగన్ అన్న పాలనలో చాలా సంతోషంగా, ఆనందంగా ఉన్నారన్నారు. వివిధ సంక్షేమ పథకాలతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్లు ఇవ్వటం జరుగుతుందన్నారు. ఏదైనా కారణం వల్ల అర్హత ఉండి పెన్షన్ రాకపోతే అలాంటి వారు తన వద్దకు వస్తే పెన్షన్ వచ్చేలా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ నగర డిప్యూటీ మేయర్ ఆళ్ల చల్లారావు, సచివాలయం వెల్ఫేర్ సెక్రెటరీ నాయక్, సుజాత, జైకేర్, నాగబాబు, సచివాలయం సిబ్బంది, పాల్గొన్నారు.

22వ డివిజన్‌లో..

తూర్పు నియోజకవర్గం ఇంచార్జ్ దేవినేని అవినాష్ ఆధ్వర్యంలో 22వ డివిజన్‌లోని 109, 110, 111, 112 సచివాలయాల పరిధిలో మంజూరైన 47 కొత్త పెన్షన్లును బుధవారం లబ్ధిదారులకు పంపిణీ చేసినట్లు 22 డివిజన్ కార్పొరేటర్, వీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు తాటిపర్తి కొండారెడ్డి తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛను ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అర్హత ఉండి పెన్షన్ రాని వారు తనకు తెలియజేస్తే పింఛను వచ్చేలా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఓ సునీత, అడ్మిన్, వెల్ఫేర్ సిబ్బంది, వలెంటీర్లు పాల్గొన్నారు.

అత్యుత్తమ ప్రమాణాలే ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): విద్యార్థులకు అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలతో కూడిన విద్యను అందించటమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టిందని ఏపీ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య కే హేమచంద్రారెడ్డి అన్నారు. ఉన్నత విద్యారంగానికి సంబంధించిన వివిధ కోర్సులను ఉచితంగా అందించే లక్ష్యంతో ఏపీ ఉన్నత విద్యామండలి సైలర్ అకాడమీతో ఒప్పందం చేసుకుంది. ఈ నేపథ్యంలో దానిపై కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు వివరించేందుకు విజయవాడ కేబీఎన్ కళాశాలలో సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి ఆచార్య కే హేమచంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాపితంగా వస్తున్న మార్పులు, నూతన ఆవిష్కరణల నేపథ్యంలో అన్ని రంగాల్లోనూ నూతన విధానాలు ఆరంభమవుతున్నాయన్నారు. అదే క్రమంలో ఏపీలో ప్రస్తుత సామాజిక అవసరాలు, పారిశ్రామిక పరిస్థితులు, భవిష్యత్ సమస్యల పరిష్కారం తదితర అంశాలను గమనంలో ఉంచుకొని ఉన్నత విద్యారంగంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అనేక నూతన సంస్కరణలకు శ్రీకారం చుట్టిందన్నారు. అదే క్రమంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యావిధానాన్ని అనుసరించి దేశంలోనే మొదటి సారిగా ఏపీ విద్యారంగంలో అనేక పెను మార్పులను తీసుకొచ్చిందన్నారు. కేవలం తరగతి బోధన, సాధారణ ప్రయోగాలు, పాత విద్యా బోధనా పద్ధతులను పక్కన పెట్టి వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా అనేక నూతన విధానాలను ప్రారంభించటం జరిగిందన్నారు. ఇంటర్న్‌షిప్ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు ప్రాక్టికల్ నాలెడ్జ్ కలిగించేందుకు డిగ్రీ చేసే ప్రతి విద్యార్థి ఇంటర్న్‌షిప్ ద్వారా కొంత నాలెడ్జ్‌ను పొందే విధంగా విద్యావిధానాన్ని మార్పు చేశామన్నారు. ప్రధానంగా సంప్రదాయ విద్యాబోధనతో పాటుగా ప్రపంచంలోని ఎక్కడ నుంచి అయినా ఆన్‌లైన్ ద్వారా వివిధ కోర్సులను విద్యార్థులకు అందించి తద్వారా పరిపూర్ణమైన విజ్ఞానవంతునిగా తీర్చిదిద్దే నూతన పద్ధతులకు తమ ప్రభుత్వం శ్రీకారం చుడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వరల్డ్ బ్యాంక్ ఓపెన్ లెర్నింగ్ క్యాంపస్ ప్రోగ్రామ్ మేనేజర్ షీలాజగన్నాథన్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ నారాయణరావు, ఉన్నత విద్యామండలి అకాడమిక్ ఆఫీసర్ డాక్టర్ విష్ణు తదితరులు పాల్గొన్నారు.

రిలయన్స్ స్టోర్ ప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట : రిలయన్స్ ట్రెండ్స్ తన నూతన స్టోర్ ని గుడివాడ సత్యనారాయణపురంలో ప్రారంభించినట్లు సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 13418 అడుగుల విస్తీర్ణం గల ఈ నూతన ట్రెండ్స్ స్టోర్ అత్యాధునిక రూపంతో మంచి నాణ్యత, ఆకర్షణీయమైన దుస్తుల శ్రేణిని కలిగి ఉందన్నారు. అలాగే ఈ స్టోర్ గుడివాడ ప్రాంతపు వినియోగదారుల అభిరుచికి తగిన విధంగా, అందుబాటైన ధరలో తాము చెల్లించిన ధరకు అత్యధిక విలువని కలిగి ఉందని చెప్పారు. ఈ పట్టణానికి చెందిన కస్టమర్లు సంతృప్తికరమైన ధరలకు ఆధునిక ఉమెన్స్ వేర్, మేన్స్ వేర్, కిడ్స్ వేర్ ఫ్యాషన్ యాక్ససరీస్ కోసం విలక్షణమైన ప్రత్యేక గొప్ప షాపింగ్ అనుభవం కోసం ఎదురుచూడవచ్చు ప్రత్యేకమైన ప్రారంభోత్సవపు ఆఫర్ కింద రూ.3999 షాపింగ్ చేస్తే రూ.249 కి ఆకర్షనీయమైన బహుమతి పొందవచ్చని వివరించారు. అంతే కాదు రూ.3999 కొనుగోలు పై వినియోగదారులు రూ.2000 విలువగల కూపన్లు పూర్తి ఉచితంగా పొందగలుగుతారనీ కాబట్టి గొప్ప ఫ్యాషన్ షాపింగ్ అనుభవాన్ని అందరూ వినియోగించుకోవాలని కోరారు.

BEFORE THE DISTRICT CONSUMER REDRESSAL COMMISION - II KRISHNA AT VIJAYAWADA
I.A. No. 393/23 in C.C.No.150/2023

Between:
1. Murala Rajesh Kumar,
2. Murala Sridevi,
(No.1 & 2 being represented by their authorized person K. Subrahmaneswara Rao of Amalapuram, East Godavari Dt.) ... Complainants 1 & 2

AND

M/s Aditya Townships Pvt, Ltd., Rep. by K.P.V. Anjani Kumar, S/o Narayana Rao, D.No.33-18-3, Challasani Venkata Krishnaiah Street, Suryaraopet, Vijayawada-2. ...2nd Opp. Party.

NOTICE

The above complainants are filed the above case against you and two others for your deficiency of services and return of the amount paid by them towards purchase of Flat from above said 2nd opp. Party and the notice sent to the above address were returned to the Honorable Commission on that the Honorable commission order to issue this publication calling upon you to attend before the District Consumer redressed commission- II Krishna at vijayawada on **19-10-2023 at 10.30 a.m** either yourself or through your counsel may present before the above said Honorable commission and submit your version, failing which, the matter will be decided on your absence and pass appropriate orders in the above case basing on the available record, documents with the Honorable Commission.
(by the order of the Honorable Commission)

M. VITTAL RAO, B.Com, B.L.
FLAT NO.2201, BRAHMAIAH VIGNAHARTHA APARTMENT, KAMAKOTI NAGAR, BESIDES R.K. HIGH SCHOOL, VIJAYAWADA-12.
Cell: 98491 77666. motupallivittalrao@gmail.com
Vijayawada Dt.13-09-2023